అధికారుల అలసత్వం.. అక్రమార్కులకు వరం!



మీటరు తొలగించాలని ఆదేశాలు ఇచ్చిన స్థలంలో నిర్మించిన భవనం

హెచ్చరిక బోర్డు ఉన్నా బరితెగించి నిర్మాణం

ఖాళీ జాగా కనిపిస్తే పాగా... అపై అక్రమ నిర్మాణాలు

మీటర్లు రద్దు చేయాలన్న డిప్యూటీ కలెక్టర్ లేఖ బుట్టదాఖలు

డిప్యూటీ కలెక్టర్ లేఖ రాసినా..



స్టీల్‌ప్లాంట్ భూముల్లో అక్రమంగా నిర్మించిన భవనాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత స్వయంగా విద్యుత్ శాఖకు లేఖ రాశారు. జీవీఎంసీ సహకారంతో భవనాలపై చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే కిందస్థాయి అధికారులు అవేవీ పట్టించుకోవడంలేదు.

వడ్లపూడిలోని ఆర్‌హెచ్ కాలనీ సెక్టార్ 1 ప్లాట్ నెం. 22/ఎ లో నిర్మించిన భవనానికి బిగించిన 111-23000వి14721, అదేకాలనీలో పెట్రోల్ బంకు వెనుక ఫ్లాట్ నెం. 271/ఎ లో నిర్మించిన భవనం మీటరు నెం. 11123000వి2000027 వెంటనే తొలగించాలని వడ్లపూడి విద్యుత్ శాఖ ఏఈకి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత లేఖ రాశారు. కానీ అలేఖ ఏమయిందో.. ఎవరికీ తెలియడం లేదు. ఆలేఖలో మాత్రం ఆరెండు ప్లాట్‌లు స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించినవని స్పష్టంగా పేర్కొన్నారు.



పవన్‌సాయి ఆస్పత్రి వెనుక స్థలంలో నిర్మాణం కోసం పడేసిన హెచ్చరిక బోర్డు

ఇదీ పరిస్థితి

విశాఖ ఉక్కు కర్మాగారం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన అనేక గ్రామాల ప్రజలకు వడ్లపూడి పరిసర ప్రాంతాల్లో అప్పట్లో అనేక కాలనీలు నిర్మించారు. నిర్వాసితులకు ఇళ్లు కేటాయించగా మిగిలిన కొన్ని స్థలాలు స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం ఆధీనంలోనే ఉన్నాయి. ఆ భూములను కొంతమంది పెద్దలు, రాజకీయ నాయకులు, దళారులు ఒక్కటై ఆక్రమించుకుంటున్నారు. అంతటితో ఆగిపోకుండా వాటిలో చకచకా నిర్మాణాలు చేపట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటువంటి భవనాలను భూసేకరణ ఆధికారులు ఇటీవల గుర్తించారు.

కూర్మన్నపాలెం: అధికార పార్టీ నేతల అండ.. అధికారుల అలసత్వం వెరసి అక్రమార్కులకు వరంగా మారుతోంది. భూకబ్జాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. ఇందుకు వడ్లపూడి పరిసర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో పెరుగుతున్న భూ కబ్జాలు.. అందులో వెలస్తున్న భవనాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కనిపించలేదా?

ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ఖాళీ జాగా కనిపించినా పాగా వేసి అక్రమ అంతస్తులు కట్టేస్తున్నారు.

ఇదే అదునుగా..

సాక్షాత్తూ డిప్యూటీ కలెక్టర్ రాసిన లేఖ కూడా బుట్టదాఖలు కావడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. పవన్‌సాయి ఆస్పత్రి వెనుక గెడ్డను ఆనుకుని మరో నిర్మాణం చేపట్టారు. ఇక్కడ మరీ దారుణం. ఆ స్థలం స్టీల్ ప్లాంట్ భూసేకరణ విభాగానికి చెందినదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అక్రమార్కులు అతి తెలివిగా హెచ్చరిక బోర్డు ఎవరికీ కనిపించకుండా గోనె సంచె కప్పిపెట్టారు. ఆ తర్వాత నిర్మాణం కొనసాగిస్తున్నారు. దాని వెనుక కొంత మంది పెద్దలు ఉన్నారని అధికారులు కూడా నోరు విప్పడం లేదు. అధికారులు ఇదే వైఖరి అవలంబిస్తే వడ్లపూడిలో అన్ని స్థలాలు అక్రమార్కుల కబంధహస్తాల్లో చిక్కుకుంటాయని పలువురు వాపోతున్నారు.



271/ఎలో నిర్మించిన భవనం

క్లుప్తంగా

భెల్ కార్మికులకు స్వీట్లు అందజేత



భెల్ గుర్తింపు యూనియన్ నాయకులకు స్వీట్లు అందజేస్తున్న అధికారులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ యాజమాన్యం 2024–25 సంవత్సరానికి గానూ విశేష సేవలందించిన కార్మికులకు స్వీట్లు అందజేసింది. సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) జి.చంద్రశేఖర్, అధికారి సీతారాం మిఠాయి బాక్సులను గుర్తింపు యూనియన్ ప్రతినిధులు, ప్రతిభ చూపిన కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రతినిధులు సుభాకర్ సాహు, బొండ బాబూరావు, కొల్లి దేముడు, పి.వి.ఎస్.రాజు, టిక్కలి భాస్కరరావు, పి.వీర బాబు, బి.రవీంద్ర, బి.వెంకటేశ్వర్లు, వి.గోవిందరావు, కంచిపాటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఆచార్య జేమ్స్ స్టీఫెన్



ప్రిన్సిపల్ నరసింహారావును సత్కరిస్తున్న ఆచార్య స్టీఫెన్

విశాఖ విద్య: డిజిటలైజేషన్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ అన్నారు. వర్సిటీలోని అంబేడ్కర్ చైర్‌లో రెండు వారాల పాటు నిర్వహించనున్న ఐసీఎస్‌ఎస్‌ఆర్ స్పాన్సర్డ్ కెపాసిటీ బిల్డింగ్ ప్రొగ్రాంను మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులతో పాటు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆచార్య జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఈ నెల 14 వరకు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అన్ని రంగాల్లోనూ డిజిటలైజేషన్ పాత్ర గణనీయంగా పెరిగిందన్నారు. మొదటి రోజు ఆచార్య ఎం. రాంజీ డిజిటలైజేషన్‌లో టెక్నాలజీ పాత్ర, ఆచార్య గోవాడ వీర్రాజు పాలనారంగంలో వస్తున్న మార్పులను వివరించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావును అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ ఆధ్వర్యంలో సత్కరించారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వల్ల తక్షణ ఉద్యోగావకాశాలు లభిస్తాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కాలేజీ సమీపంలోని శ్రీశాంతి నికేతన్ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్యపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి 18 ఏళ్లు దాటిన విద్యార్థులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో మంచి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. పాలిటెక్నిక్ కోర్సులు చదవడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా బీటెక్‌లో నేరుగా రెండో సంవత్సరంలో చేరి ఉన్నత విద్యను కొనసాగించుకోవచ్చన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో చేరిన విద్యార్థులు నూరు శాతం క్యాంపస్ ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆయన వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పాలిసెట్‌కు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో తమ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు.

80 మందికి కంటి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

పెదగంట్యాడ: కామ్రేడ్ గొల్లపల్లి సుబ్బారావు వర్ధంతిని పురస్కరించుకొని సీఐటీయూ, రామచంద్రనగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. ముందుగా సుబ్బారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 80 మంది రోగులను పరీక్షించారు. అందులో 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సీఐటీయూ గాజువాక అధ్యక్షుడు రమణ, నారాయణరావు, రాజారావు, త్రినాథ్, మోహన్, శంకరరావు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ



గ్యాస్ సిలిండర్లు అందిస్తున్న గంగులయ్య

అగనంపూడి: ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు మాసాలకు గానూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని అగనంపూడిలో బిందుశ్రీ గ్యాస్ ఏజెన్సీ అధినేత వి.గంగులయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, బండారు చందు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరిస్తున్న శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: విధి నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పని చేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని పద్మశాలి జిల్లా సంఘం నాయకులు పప్పు రాజారావు అన్నారు. పద్మమార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెదమడక మైదానంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పొన్నగంటి భాస్కర సత్యప్రసాద్, నాగేశ్వరావు, వానపల్లి జగ్గారావు, చేనేత వృత్తి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న వయో వృద్ధుడు గుదే తాతారావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఉద్యోగిగా గుర్తింపు పొందడం కష్టమన్నారు.ఎంతో శ్రమిస్తే తప్పా అధికారులు, సహచరుల మన్ననలు పొందడం సులువుకాదన్నారు. మార్కండేయ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు దొడ్డి దేముడు, బేతా లక్ష్మి, వీర హనుమంతురావు, గంధోళి వెంకటరమణ, పుట్టా శ్రీనివాసరావు, మెత్తపాటి మోహన్‌మురళి, గంధోళి పైడికొండ, పచ్చారి రామలక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి జన్మదిన వేడుకలు



మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న గొల్ల బాబూరావు, కరణం ధర్మశ్రీ, గుడివాడ అమర్‌నాథ్, నాగిరెడ్డి

పెదగంట్యాడ: పెందుర్తి మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో నిర్వహించిన వేడుకలకు రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణ కుమారి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు మంత్రి రాజశేఖర్, కొయ్య ప్రసాద్‌రెడ్డి, పులుసు జనార్దన్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి సరకుల వితరణ



మానసిక దివ్యాంగులతో సుధీర్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంకు చెందిన ఎన్ఆర్ఐ గొందేశి సుధీర్ రెడ్డి తన సేవా నిరతిని చాటుకుంటున్నారు. కొత్తవలస వద్ద గల చైతన్య మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు మంగళవారం రూ.50 వేల విలువైన నిత్యావసరాలను అందజేశారు. ఇకపై సహాయ సహకారాలు కొనసాగిస్తానని తెలిపారు.

చికిత్స పొందుతూ ఉక్కు కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–2లో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికుడు బలిరెడ్డి పెంటయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. మార్చి 14న విభాగంలో విధులు నిర్వహిస్తుండగా మంటలు చెలరేగి పెంటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని నగరంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేద్దాం



భెల్ గేటు ఎదురుగా సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న సీటూ నాయకుడు జగన్నాథరావు

అక్కిరెడ్డిపాలెం: తమిళనాడులోని మధురైలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న 24వ సీపీఎం అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని భెల్ (హెచ్‌పీవీపీ) సీపీఎం నాయకుడు ఎస్.జగన్నాథరావు అన్నారు. సంస్థ ప్రవేశ గేటు వద్ద మంగళవారం సీపీఎం జెండాను ఆవిష్కరించారు. మహా సభల్లో రానున్న మూడు సంవత్సరాల్లో చేపట్టబోయే పోరాటాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు నిరసనగా కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.టి.పి.ప్రకాష్, సీతంనాయుడు, వి.విజయకుమార్, కొల్లి దేముడు, డి.లక్ష్మి, నారపురెడ్డి, సీహెచ్.మురళీశ్వరరావు, ఎస్.చిన్నమ్మలు, జి.చిన్నబాబు, బి.కృష్ణమూర్తి, విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఎస్.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు నిత్యావసర సరకులు



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రెండు నిరుపేద కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు పట్టా రామ అప్పారావు ఆర్థిక సాయంతో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు. బియ్యం, పప్పులు, నూనెలు, పంచదార, చింతపండు, సబ్బులు ఇతర వంట వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ ఎంత ధనం ఉందనేది ముఖ్యం కాదని, దాన గుణం ఉన్న వారికే గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, ట్రస్ట్ చైర్మన్ మారా మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు శీరంశెట్టి గోవిందరావు, లక్కరాజు రాము, జామి గణేష్, బొండా ఈశ్వరరావు, పిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు పోరాటాలు ఆదర్శం



దివంగత సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ గంగారావు

అక్కిరెడ్డిపాలెం: ప్రజల సమస్యల పరిష్కారానికి దివంగత జి.సుబ్బారావు చేసిన పోరాటాలు ఆదర్శనీయమని 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు అన్నారు. 69వ వార్డు శీలానగర్‌లో మంగళవారం సుబ్బారావు రెండో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు అండగా ఉన్న వ్యక్తిని కోల్పోవడం బాధాకరం అన్నారు. చివరి వరకు నమ్ముకున్న సిద్ధాంతాల కోసమే పనిచేశారని కొనియాడారు. ఎర్రజెండా అండతో కార్మికులకు, పేదప్రజలకు నిస్వార్థ సేవ చేసిన గొప్ప నాయకుడు సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో గాజువాక సీపీఎం జోన్ కార్యదర్శి జి.రాంబాబు, ఐద్వా నాయకులు ఎస్.జగన్నాథరావు, వై.సత్యవతి, ఎ.లోకేష్, రాజేంద్రప్రసాద్, జి.మణి తదితరులు పాల్గొన్నారు.

కాలువలు శిథిలం.. వ్యర్థాల మయం

- దోమలు, పందులతో అవస్థలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రజల ఆగ్రహం



కోరాడ 20–20 పార్కు పక్కన కాలువ దుస్థితి



కుంచమాంబ ఆలయం సమీపంలో ప్రధాన రహదారిలో..



వుడా కాలనీ చైతన్య కళాశాల పక్కన ప్రధాన రహదారిలో..

పెదగంట్యాడ: మండలంలోని పలు ప్రాంతాల్లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పలు చోట్ల ఛిద్రం కావడంతో మురుగు నిలిచిపోతుంది. ఆయా ప్రాంతాల్లో పందులు తిష్ట వేస్తున్నాయి. చెత్త సేకరించే వాహనాలు సమయానికి రాక, ఇంట్లో వాడే చెత్తను రోడ్లపై వేయడంతో అవి కాలువల్లోకి చేరుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ఇళ్లలో వాడుక నీరు తోతట్టు ప్రాంతాల్లో చేరి మురుగు కూపాలుగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిత్యం దోమలు, పందులతో సాహవాసం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రమం తప్పకుండా పన్నులు వసూలు చేస్తున్నారు కానీ, సమస్యల పరిష్కారంపై దృష్టిసారించడం లేదని అంటున్నారు. దోమలతో వేగలేక, దుర్వాస భరించలేక కిటికీలు, తలుపులు మూసుకుంటున్నామని వాపోతున్నారు. దోమల బెడదతో పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పూడికలు తీయించడంతో పాటు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

విశాఖ విద్య: అమెరికాలో ఉన్నత విద్య, పరిశోధనలకు అందించే వివిధ స్కాలర్‌షిప్‌లను భారతీయ యువత సద్వినియోగం చేసుకోవాలని యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చెన్నై రీజినల్ ఆఫీసర్ మాయా సుందర రాజన్ అన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో ఫుల్‌బ్రైట్ నెహ్రూ స్కాలర్‌షిప్‌తో పాటు వివిధ స్కాలర్‌షిప్‌లపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్‌లపై విస్తృత అవగాహన కల్పించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంతో ఉన్నత విద్య సంబంధాలను మరింత బలోపేతం చేసే విధంగా ఈ స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్ 1946లో ప్రారంభమైందని, ప్రస్తుతం 160 దేశాల్లో ఇది అమలవుతుందని చెప్పారు. ఇప్పటివరకు నాలుగు లక్షల మందికి ఈ స్కాలర్‌షిప్ ద్వారా అమెరికాలో ఉన్నత విద్యను పొందే అవకాశాన్ని పొందారని చెప్పారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్. రాజు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య, పరిశోధన జరపడానికి ఎంతో ఉపయోగకరంగా స్కాలర్‌షిప్‌లు నిలుస్తాయని చెప్పారు. ఈ స్కాలర్‌షిప్‌లు సాధించిన వారు విదేశాల్లో పొందే వివిధ సదుపాయాలు, అవకాశాలు తెలియజేశారు. ఏ దేశంలో పరిశోధన చేయాలి అనే అంశంపై నిర్దిష్టమైన అవగాహనతో ఉండాలని సూచించారు.

ఘనంగా ఉత్కళ్ దివస్



ఉత్కళ్ దివస్‌లో పాల్గొన్న ప్రముఖులు

బీచ్ రోడ్డు:ఒడిశా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉత్కళ్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దసపల్లా హిల్స్‌లోని ప్రాంగణంలో వేడుకలు జరిపారు. 1936 ఏప్రిల్ 1న భాషా ప్రాతిపదికన ఒడిశా రాష్ట్రం ఏర్పాటు జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఒడిశా వాసులంతా ఈ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒడియా ఫుడ్ ఫెస్టివల్, హ్యాండ్లూమ్ ఫెస్టివల్‌ను కేంద్ర ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ రాజేంద్ర కుమార్ ప్రారంభించారు. చేనేత ఉత్పత్తులను తిలకించి ప్రశంసించారు. ఒడిశా ప్రాంత ప్రముఖులైన మధుసూదన్ దాస్, గోపబంధు దాస్, కృష్ణ చంద్ర గజపతి మహారాజ్ వంటి వ్యక్తులకు నివాళు లర్పించారు.